("జ్యోతి" మాసపత్రిక; జనవరి 1966)

త్రివర్ణ చిత్రం

సరళాదేవి రిస్టువాచీ చూసుకుంది.

పదిన్నర!

వర్షం అలా పడుతూనే ఉంది, తెరిపి లేకుండాను. 'వెధవ వర్షం' అని పైకే విసుక్కుంది సరళాదేవి.

రామకోటి ఆమెని గమనించకుండా బల్లమీద చతురంగ బలాలు పేరుస్తున్నాడు.

"మరో ఆట వేద్దామంటావా!" అంది సరళాదేవి ఆవలిస్తూ చిటికలేస్తూ.

"అయ నొచ్చేవరకూ ఆడుతానంటివిగా!.... నీ ఇష్టం, పోయి పండుకుంటానంటే వెళ్ళు. నాదేం లేదు!" అని రామకోటి ఆమెవెళ్ళిపోడం తన కిష్టం లేదని తెలియజేశాడు.

వరండాలో కుర్చీలో కూర్చున్నారు. రామకోటీ, సరళాదేవీను, టేబిల్ పొడుగుపైపు ఒక కుర్చీ, వెడల్పుపైపు మరొకటీ, టేబిలుమీద చతురంగ బలాలూ యుద్ధానికి సిద్ధంగా ఉన్నాయి.

"ఆయనింకా ఎప్పుడొస్తారో.... వూరంతా నిద్రపోయిందిగాని ఇంకా ఇంటికి జేరటానికి వేళకుదర్లా." అని పైకే అనుకొని, రామకోటి కళ్ళలోకి చూసి "నాదా?" అని, యూదాలావంగా బంట్లు తోసింది సరళాదేవి. మరుక్షణం ఆమె దృష్టి గేటువేపు మళ్ళింది.

అక్కడింకా ఎవరూ ఒచ్చిన అలికిడిగాలేదు.

సరళాదేవి ఆనందరావు భార్య, అతను ఎడ్వకేట్. రామకోటి ఆరు నెలల్రకితం ఇన్‌కమ్‌టేక్స్ ఆఫీసరుగా వొచ్చాడు.... ఇంతకు ముందుండే ఆఫీసరు, అదే ఇంటిలో, క్రింది వాటాలో ఉండేవాడు. ఆయన వెళ్ళిన తర్వాత పదిహేనురోజులకి రామకోటి ఈ వూరు వొచ్చాడు. ఆ పదిహేను రోజుల్లోనూ ఆనందరావు ఇంటివాళ్ళతో మాట్లాడి తను మేడమీది వాటాలోంచి క్రింది వాటాలోకి మారిపోయాడు.

"మేడమీది వాటా అయినాసరే, నా కభ్యంతరం లేదు!" అని రామకోటి ఇల్లు చూసుకున్నాడు; చేరేడు.

మర్నాడు పొద్దున్నే అతను దగ్గిరుండి నేమ్‌బోర్డు కొట్టిస్తూ వుండగా సరళాదేవి అటొచ్చి అతన్ని గుర్తుపట్టింది.

"హల్లో—ల్లో— రాంకోటి! నువ్వా, ఈ ఇన్‌కమ్‌టేక్సాఫీసరు? బలే! ఎంత చిత్రం!" అన్నది. మొహం అంతా ఆశ్చర్యం ఆనంధం, నవ్వూ చేసుకొని.

కడుపునిండా ఒచ్చిన సంతోషం రామకోటి కూడా మొహంనిండా కనబర్చాడు. "— అరె! మీరా? ఈ క్రింది వాటాలో ఉంది? —ఆనందరావు, బియ్యే బియల్, అంటే పరఘ్యాన్నంగా ఎవరో అనుకుంటున్నాను. జస్ట్ వండర్‌ఫుల్!—ఆనందరావు ఈ వూళ్ళో పెట్టాడా ప్రాక్టీసు?"

"బందర్లో బాగులేదని యిక్కడి కొచ్చేశాంగా! ఐదేళ్ళయింది."

—ఆనందరావూ, రామకోటీ, సరళా, వొక్క కాలేజీలోనే చదువుకున్నారు. అందరికీ అందరూ తెలుసు. అందరూ తెలియడమే కాదు; అంతా తెలుసు.

రామకోటి ఆ రోజుల్లో సరళని కోరేడు; ప్రేమించాడు, ఆరాధించేడు.... తీర్చిదిద్దిన బొమ్మలా వుండేది సరళ. అంతేకాదు. చూసిన వాళ్ళందర్నీ వెర్రెత్తించేటంత చలాకీగా, దూకుడుగా వుండేది. ఇంకొంచెం అయితే ఎబ్బెట్టుగా వుంటుందన్నంతగా సౌందర్య ప్రదర్శన చేసేసేది....బట్ట కట్టడంలో, బొట్టు పెట్టడంలో, జుట్టు దువ్వుకోడంలో సరళాదేవి కళే వేరు. నడవడంలో, నవ్వడంలో పరుగెత్తడంలో పడిపోతుందేమో చూదాం అనిపించిజనాన్ని నిలబెట్టేయడంలోసరళాదేవి పద్ధతే వేరు. ఆమెని అనుకరిద్దామని ఆడపిల్లలూ, అనుసరిద్దామని మగపిల్లలూ ఊరేవాళ్లు.

.... అది అప్పటి మాటే— అప్పటి సరళ యిప్పటి సరళలో యెక్కడేనా కనబడుతుందేమో అని వెతుకుతున్నాడు రామకోటి....ఇప్పుడైతే మట్టుకేం? —సరళ అప్పటికంటె ఎక్కువ నిండుతనం ప్రదర్శిస్తూ, అప్పటికంటె ఎక్కువ ఆదరం చూపిస్తూ; అప్పటికంటె ఎక్కువ అందంగా కనిపిస్తోంది.... ఈ నిండుతనంలో, ఆదరంలో, ఆత్మసౌందర్యం ఎక్కువగా ఉన్నట్టుంది.

పరిణతి పొందిన ఆనందానుభవం సరళ— అప్పుడేదో అజ్ఞానంలో, అడిగితే అవునూ కాదూ అనలేకపోయింది.... ఇప్పుడేమనుకుంటోందో, సరళ?

రామకోటి ఆమె కళ్ళల్లోకి చూశాడు. అవి అస్పష్టంగా అటూ యిటూ కదిలేయి. ఎటో యెటో చూసి వెతికి, ఎక్కడా ఏమీలేదని గ్రహించినట్టు మళ్ళీ యిటొచ్చేయి.

"ఏంటో—అదోలా వున్నావు సరళా!"

"ఏం లా" అనవసరంగా నవ్వింది సరళ.

"అతను రాలేదనేగా!........ ఒస్తాడులే....యిదేంకొత్తా?"

సరళ నవ్వుకుంది. ఏదో ఓదార్పు చెప్పాలని చెబుతున్నాడు రాంకోటి. అంతే, అదొక ఫార్మాలిటీ. ఆడదానికి మొగుడో ఎవడో రక్షణ వుండాలి.రక్షణ దొరుకుతుందిలే అని అభయం యివ్వడం సిల్లీ ఫార్మాలిటీ!

—కాని, పార్మాలిటీస్ దాటగలిగిన స్నేహం తమది....ఆ మాటకొస్తే అన్ని అవరోధాలూ అతిక్రమించగల అనుబంధం— మొగ్గలోనే తుంచేసినా మోడే చిగురించగల ఆనందానుబంధం. అమృతం, అనంతం; అది అనుభవంతో ఆరిపోయేదిగాదు.

తన అందాన్ని—అమ్మకంటే బహిరంగంగా, అద్దంకంటే స్పష్టంగా, చెప్పగలిగిన రాంకోటి తన ఆనందాన్ని- ఆనందరావు కంటె అభిమానంగా, ఆత్మకంటే ఆప్యాయంగా ఆకాంక్షించి ఆవేశపడ్డ రాంకోటి; తనే సర్వస్వమనుకునేవాడు ఒక్కడైనా ఉన్నాడన్న గర్వం తనకు కలగజేసిన రాంకోటి-అతన్ని చూస్తూ వుంటే, అతని సమక్షంలో వుంటే, అనుభవానికి ఆత్మమీద అనవసరంగా యింత ఆగ్రహమూ అసూయా ఎందుకూ అన్న మీమాంస కలుగుతుంది.

"సరళా; నువ్వందంగా ఉన్నావు.... నువ్వంటే నాకెంతో యిష్టం" అన్నాడు రామకోటి. అంత తియ్యటి మాటల్ని అంత స్పష్టంగా చెప్పిన మొదటివాడు (ఆఖరువాడు కూడా) అతనే........ఇప్పుడు అనడేం?—ఇప్పుడూ అంటూనే ఉన్నాడేమో! ఆ మాటల్ని వాతావరణం మింగేస్తోంది గావును! అతని నోటంట ఆ మాటలు అలకించే అర్హత పోగొట్టుకుంది తను.

"నన్ను పెళ్ళిచేసుకో సరళా.... అలాచేస్తే నీ కంకితం చేసి నా బ్రతుకు సార్థకమైన 'సరళ రేఖ'గా తీర్చి దిద్దుకుంటాను. అన్నాడు ....ఇప్పుడు

కాదు, ఎప్పుడూ. ఆనందరావుగాని, మరొకరు గాని మళ్ళీ ఆ మాట అన కుండానే అంతా జరిగిపోయింది.

—ఆరోజు—అతను తనకివ్రాసిన లేఖని, మెస్‌వార్డెనూ, ప్రిన్సిపాల్ గారూ పంచాయితీకి పెట్టినరోజు— వాళ్ళు చేసిన ఫస్ చూసి- 'అయన నా కుత్తరం రాసేడని అంత యిదేం, మీ కందరికి! నేను ఆయన్నే పెళ్లాడుతాను. ఊరేగండి!, అని పైకే అనేద్దామన్నంత ప్రేరేపణ కలిగింది- కాని అనలేక పోయింది.

—అదొక చిత్రమైన లేఖ— పెళ్ళినే పెక్కు సార్లు పెద్దగా ఉద హరించిన ప్రేమలేఖ- ఆస్తులూ అవకాశాలూ వర్ణించాడు. తండ్రి కొక్కడే కొడుకు, ఒక్క తల్లికి కాదు. పెద్దమ్మకూ, చనిపోయిన సవతి తల్లికీ ముగ్గురు తల్లులకు- ముచ్చట పంటైన ముద్దుబిడ్డ. కలిగినింటివారి గారాబుపట్టి....ఏం చేసినా సహించడమేకాక మెచ్చుకోవడం నేర్చిన పెద్దలు....చురుకుతనంతో, జ్ఞానంతో ఆకట్టుకున్న స్నేహితులూ, ఉపాధ్యాయులూ- చూడు సరళా, ఇదీ నా ప్రపంచం. నా చుట్టూ మనుష్యులు ఇంతలాంటి దేవతలు.... వీళ్ళనిబట్టి నన్ను తెలుసుకోగలవు- ఈ జనంలోకి. ఈ మనస్సులోకి నీలాంటి సుందరి. సుమతి. గృహలక్ష్మిగా, రాణిగా ఉంటే తప్ప నిండుతనం రాదు- నీవేపు ఏ మాత్రం అయినా దురదృష్టం, అనుమానం, సందేహం వుంటే, యెంత పెద్దవైనాసరే, ఎంత మొండివైనా సరే, వెంటనే తెలియజెయ్యి, దాటడానికి మార్గం, పోనీ తప్పించుకోడానికి తరుణోపాయం చూసి తెలియజేస్తాను-

'ఇందులో వొక్క అక్షరం అబద్ధం లేదండీ....ఏదో వుద్రేకంలో తాత్కాలిక వుల్లాసంలో, అర్ధరాత్రిపూట అరకప్పుటీ కొట్టేసి అప్పటికప్పుడు లెచ్చుకున్న అవేశంలో రాసినజాపతు కాదండీ. అంతా ఫీలై, అన్నిటికీ సిద్ధమై వ్రాసేనండీ-'అన్నాడు; ఆనాడు ప్రిన్స్‌పాల్‌గారు, కొందరు లెక్చరర్లు, అతన్ని నిలబెట్టి సంజాయిషీ అడిగితే.

'డిస్మిస్ హిమ్!' అంది మెస్ వార్డెను; నలభైరెండేళ్ళ ఆజన్మ బ్రహ్మచారిణి, పదేళ్ళ మెస్‌సర్వీసులో-వెయ్యిన్నొక్క ప్రేమ లేఖల్లో- వొక్కటికూడా తనది కాకపోయెనే అన్న కసివెళ్ళగక్కుతూ,

'పోనీ ఆ అబ్బాయికే యివ్వరాదటమ్మా, పిల్లనూ!-అంతగా యిష్టపడు తున్నారాయె!' అని ప్రిన్సిపాల్ గారంటే-

.... 'అన్నీ బాగానే వున్నైగానండీ. కోడలు(పట్లబ్బాయి కెట్లా యిచ్చారు
నండీ అమ్మాయినీ?- కమ్మోరంతా నామీద ఉయ్యరూ?'- అమ్మ....త
ఆదరణాతిరేకంతో, తండ్రిగారు లేకపోవడమే అదృష్టమనిపించిన అమ్మ
కలలో కనబడ్డది యిలలోకి తెచ్చిచ్చి లాలించి. కన్నవారుగాని ఉన్నవారుగా
కనీవినీ యెరక్కపోయినా, కల్యాణం కాదు కాలేజీయే కావాలన్నప్పుడు క
కరించిన కన్నతల్లి, కాకూడని సమయంలో కరుగ్గా అయిపోయింది.

'అతన్నే పెళ్లాడతానమ్మా. కులం గోత్రం కూడు బెడతాయా? కులము
పాడూ!,' అనలేకపోయింది తను. పోనీ యింకో విధంగా అతన్తో చెప్పాలని
పించినా, అంత మర్యాద మనిషికి యింత హీనమైన సలహా యివ్వడమా అని
పించింది....ముగ్ధత్వం వొదలనినాడు మొహమాటం ఎలావదుల్తుంది?

అలా జరుగుతాయి పెళ్ళిళ్ళు- ఇరవై ఏళ్ళకి చేసినా బాల్యవివాహమే
తనది!....

ఆ సరళని చూస్తూ యిప్పుడు మనస్సు నవ్వుతున్న చిరునవ్వును దాచు
కొంటూ. ఏవేనా వాక్యాలు నోరుజారి వచ్చేస్తాయేమోనని బెదిరిపోతూ రామకోటి
వేపు దొంగతనంగా చూసింది సరళ.

0 0 0

ఆనందరావు ఆమెని పెళ్లాడాడు.... 'లా'పూర్తి చేసుకొని ఎప్రెంటిస్
షిప్ కోసం బందరు ఒచ్చిన ఆనందరావు, రామకోటి కలిసి ఓ యిల్లు అద్దెకి
తీసుకున్నారు. సరళనిచూసి, రామకోటి కథంతా తెలుసుకొని 'కులం వొక్కటే
నీ డిస్క్వాలిఫికేషనైతే ఆ అమ్మాయిని నే చేసుకోవల్సిందే- అన్నివిలువలున్న
మనిషినిపైకి పోనియ్యటానికి లేదు.' అన్నాడు.

-తరవాత కూడా రామకోటి వాళ్ళింట్లో ఉన్నాడు. 'ట్రియో' కలిసే
కనబడేవారు,ఎక్కడచూసినా! కాఫీహోటల్సులోనూ, పార్కుల్లోనూ, షాపు
ల్లోనూ, రోడ్లమీదా- ముగ్గురూ కలిసే కనబడి జనానికి ముక్కులమీద వేళ్ళూ
చెవులమీద చేతులూ వేయించే వాళ్ళు. సినిమాల్లో సరళని మధ్యన కూచోబెట్టి
ఇటొకరూ అటొకరూ కూచుని జనాన్ని ఏడిపించుకుతినేవారు.

ఈ ఎనిమిదేళ్ళ తరవాత, మళ్ళీ నాటికి నేడు ఇక్కడ కలిసివుండడం
సంభవించింది, మళ్ళీ కూలాసాగా కాలం గడుపుతున్నారు వాళ్ళు. ఆరునెలలలో,

క్లబ్బులూ. పేకాటలూ. షికార్లూ, సినిమాలూ, పిక్నిక్‌లూ. పార్టీలూ, ఎన్నో చోట్ల ఎన్నో రకాలుగా ఎంతోమందికి ముగ్గురూ విడిపోకుండా కనబడి ఆశ్చర్య పరిచేరు. ఎవరికి పరిచయం చేసినా, మా 'ఫ్రెండ్'! అంటారు రామకోటిని, ఇద్దరూనూ. వాళ్ళమధ్య బంధుత్వం కలవలేదు. అది వాళ్ళకి అవసరంలా కన బళ్ళేదు. ఇలా పెళ్ళయిపోగానే అలా అన్నయ్యగారూ అంటూ పిలవడం ప్రారంభించలేదు సరళ. అది వాళ్ళ ముగ్గురూ అనుకోకుండా అవలంబిస్తున్న ఆనంద బాంధవ్యం.

రామకోటి, పెళ్లాడేడు, ఇద్దరు పిల్లలు. మూడోమారు కనటానికి ఆమె పుట్టిల్లూ అత్తిల్లూవున్న వూరు వెళ్ళింది.

'ఆమె వొచ్చేంత వరకన్నా మా ఇంట్లో తిను. ఆనక నువ్వెట్లాగూ మడిగట్టేసు కుంటావు' అన్నది సరళాదేవి, ఎంత ఫేహూపప్పూ ఉర్లగడ్డలేగా. ఆమెగారు నీకు బెట్టేది?'

0 0 0

'ఎత్తు వెనక్కి తీసుకుంటావా! ఇదిగో, ఈ స్క్వేర్‌లో వుండేది నీక్వీన్ వేలుపెట్టి చూపించాడు రామకోటి,

సరళ గడిలో చూస్తూ ఒడిలో చూసుకుంది- పైట ఎప్పుడు జారి పోయిందో....పూర్ణత్వాన్ని పొందిన యవ్వనం ఆచ్ఛాదన లేక నిండుగా గుండ్రంగా కనబడిపోతోంది.

చటుక్కునపైట సర్దుకొని రామకోటి మొహం చూసింది సరళాదేవి. అంతసేపూ ఆటుచూస్తూన్న రామకోటి హటాత్తుగా రోడ్డువేపు దృష్టి మళ్ళించేడు. 'అక్కడ విశ్రాంతి తీసుకునే తల- ఎన్ని వేల విలువ చేసునో-?'

వర్షంపడుతోంది....వర్షం చిందిన వరదలో.... హర్షంపొందిన యెడదలో ....పరప చిమ్మినబురదతో....ఎడదకమ్మినబెడదలో....ఎక్కడచూసినా చూసిన దృశ్యమే సుందరతరంగా కనబడుతోంది....దృష్టి మరల్చుకున్నా కళ్ళకి కనబడుతూనే ఉంది, ఆ దృశ్యం అదృశ్యం కాకుండాను- మనస్సునుమాపిన హృదయం....ఆనందరావు రాలేదు....అనవసరంగా ఆలస్యం చెయ్యడం అల వాటు చేసుకున్నాడు. ఆమెని కాల్చుకు తింటున్నాడు. ఎప్పుడూ ఏదో గొడవ ....పార్టీలూ, సాక్షులూ, వ్యాజ్యాలూ. అప్పీళ్ళూ, మేజిస్ట్రేట్లూ, జడ్జీలూ, బార్

ఎసోసియేషన్ మీటింగులూ అనుకుంటూను....నల్లకోట్లు రెపరెపలు....నల్లగౌన్ల పరంపరలు....తనకీ వుంది-నల్లబజారు ప్రాపకం....నల్లధనం వైభవం....నల్ల భార్య సౌరభం........

'ఇంకా రాలేదెందుకో-?' అంది సరళ.

'బహుశా వర్షానికి ఆగాడేమో—'

'వర్షమైతే ఆగిపోవాల్సిందేనా యేంటి?'

'బలేపనే: అటు చూడ్రాదూ, ఎట్లాపుందో, జోరు?'

'పొనసుకో....ఐతే మాత్రం?—ఏ రిక్షవాడికో మరో పావలా పారేసి రారాదా యేం?'

వర్షంకేసి చూస్తూ అనవసరంగా మాట్లాడుకుంటున్నామని యిద్దరూ తెలుసుకున్నారు. ఒక్క నిమిషం మౌనంగా వొకరి మొహం వొకరు చూస్తూ కూచుండిపోయారు. ఆ సమయంలో వాళ్ళ మనస్సుల్లో ఏం భావాలు కదలాడేయో చెప్పడం కష్టం-హటాత్తుగా మెరుపు మెరిసింది: పెద్దగా వురిమింది.

మెరుపులో సరళ మొహం కనబడ్డది రామకోటికి. వెంటనే ఆమె మొహం మళ్ళీ చూశాడు. సరళ మొహంలో మెరుపు కనబడ్డది, సినిమాల్లో ఉపయోగించే లైబ్రరీషాట్స్‌లోని పిచ్చిగీతలు ఆమె మొహంమీద కాంతివంతమైన రేఖలుగా క్షణం- భయంకరమైన కొలరేడో లోయల్లా మరుక్షణంముద్రించబడ్డట్టు కనుపించింది....మొహాలు మనస్సులకి సూచికలంటారు. ఈ మొహం సరళ మనస్సుది కాదు. సరళ....సరళ....సరళాదేవి! ఎదురుగా కనబడుతున్న బెదురు చూపుల మొహంలో, హృదయంలో పదిలపరచుకొన్న వదులైన జ్ఞాపకాలేవైనా చెదురుమదురుగా కనబడతాయేమోనని వెదకి వెదకి చూసేడు రామకోటి. కాని మరు నిమిషంలోనే, అవి తనని కుదురుగా కూర్చోనివ్వవని తెలిసి, అదిరిపడ్డాడతను, ఆ జ్ఞాపకాలు బరువైన అడుగుల్తో ఎదమీద నృత్యం చేస్తాయి.

అతనలా చూస్తూనే ఉన్నాడు. సరళాదేవి మూడుసార్లు చూపు నేలమీదకి మళ్ళించి మళ్ళీ మూడుసార్లూ అతని మొహంలోకే చూస్తూ కూచుంది. మళ్ళీ మెరుపు మెరిసింది. రామకోటి మెరుపు చూశాడు. సరళాదేవి అటు చూడలేదు. 'ఇంక నే నాళ్లేనబ్బా!' అన్నది: ఉరుం చప్పుడులో బలంకలిపిన గలగల కలగా

పులగం అయిపోయింది. అతను మళ్ళీ యిటు చూసేసరికి ఆట మధ్యలో సమాప్తమైనంత విచారం కలిగింది.

"అరె! కలిపేశావా?'

'ఏం?' సిల్లీగా నవ్వింది. సరళాదేవి.

'నీ ప్రాబ్లెమ్‌కి నేను సొల్యూషన్ చూపిద్దామనుకున్నాను. మొన్న-ఆ రష్యా ఛాంపియనుండ్లా-వాడికీ యిట్టాంటి ప్రాబ్లెమే ఒచ్చింది.... సన్‌డే హిండూలో కామెంట్ చేసేడు....

'నాకు ప్రాబ్లెమూలేదు, నీ సొల్యూషనూ అక్కర్లేదు!' అంది సరళ, అతన్ని వంకరగా చూస్తూ, మిస్చివస్‌గా నవ్వుతూ, శ్లేషించాన్లేవోయ్ అన్నట్టు.

'అబ్బా! అదేంటి సరళా అట్లా మాట్లాడతావు! నే నేమన్నానని?' అన్నట్టు నిర్దోషి మొహంపెట్టి మాట్లాడకుండా కూచున్నాడు రామకోటి.

సరళ పక పకా నవ్వింది. 'నేను మాత్రం ఏమన్నాను?' అన్నట్టు తేల్చేస్తూ, చథరంగం బలం భరిణెలో పోస్తోంది.

వీధిలో కారాగింది. గేటు తెరచుకొని వో అబ్బాయి, ఆనందరావుని గొడుగులో వరండా మెట్లదాకా తెచ్చి విడిచాడు.

'పొద్దున నాలుగింటికే వస్తానండోయ్!' అని వెళ్ళాడు.

'ఓ, క్కే!' అని వరండా ఎక్కాడు ఆనందరావు.

0 0 0

జేబులోంచి రుమాలు తీశాడు ఆనందరావు. నెత్తి తుడుచుకొని, మొహంలోకి చిన్న నవ్వు తెచ్చుకొని, ఓసారి సరళవేపూ ఓసారి రామకోటివేపూ చూశాడు దర్జాగా నిలబడుండే.

'ఎట్లా అయితేనేం యింటికి చేరారే' అన్నది సరళ కసిగా,

'ఆ. చేరినట్టే, లేకుంటే కొంప మునిగేదే....' చైల్డిష్‌గా నవ్వుతూ అన్నాడు ఆనందరావు '....ఇట్టా నాకోసం చూస్తూ తెల్లవార్లూ వరండాలో కూర్చుని జాగారం చేసేవారేగా యిద్దరూ!'

"ఇంతకీ ఏం చేస్తున్నారట. ఇంత సేపూ?"

"టాట్టా లేం లేవు. బార్ ఎసోసియేషన్ మీటింగ్!"

"నే ననుకుంటూనే ఉన్నాను!" అన్నట్టుగా కుర్చీలోకదిలి సర్దుకున్నాడు రామకోటి.

"చాల్లెండి, చెబుతున్నారు—హాయిగా ప్రయివేట్ ప్రాక్టీసు పెట్టుకుని కూడా అర్ధరాత్రి వరకూ పనులు!.... గవర్నమెంటుద్యోగస్తులు నయం: పెంద రాళే కొంపకు జేరుకుంటున్నారు!—ఎండనాడులేదు:వర్షంనాడు మొదలేలేదు!" అంది సరళ ఉక్రోషం తగ్గక.

"వర్షంకదా అనే మరి కాస్సేపు కంటిన్యూచేసి మరిన్ని పాయింట్సు డిస్కస్ చేసేం మీటింగులో!" అన్నాడు ఆనందరావు మరింత సరదాగా,

"వెళ్ళి బట్టలు మార్చుకు రావోయ్, భోంచేద్దాం!" అన్నాడు రామకోటి, మాటల్లో కొచ్చిన విసుగు చేత్తో చూపిస్తూ.

"అరే! భోం చెయ్యాలా?"

"మీరు రాకుండా ఎప్పుడన్నా భోంచేశారా ఏమిటి?.... తొమ్మిదిలేదు, పదిలేదు, పదకొండూ లేదు!.... అట్లా నిమిషాలు లెక్కబెట్టుకుంటూ కూర్చు న్నాం." ఆనందరావు ఆలస్యం చేసినందుకు పశ్చాత్తాప పడకపోయేసరికి సరళకి ఉడుకుబోతుతనం వొచ్చి మాటలు తడబడుతున్నాయి.

ఆనందరావు ఈలేసుకుంటూ లోపలికెళ్ళాడు, సరళ చదరంగంబలంలో ఆఖరు పాన్లు ఒకటో రెండో వుండిపోతే అవి భరిణెలోపోసి, మూతపెట్టేసి రామకోటి వేపు చూసింది, అతను ఆమె చూపునుంచి తప్పించుకొని, వాచీ వేపు చూసి, రాని ఆవలింతకోసం ప్రయత్నించాడు. సరళ తనుకూడా అనుకో కుండా వాచీకేసి చూసింది. పదకొండూ ఇరవై, లేచి, "రా, రాంకోటీ, భోం చేద్దాం!" అన్నది వీలైనంత మృదువుగా, వెనక్కి తిరిగి ఇంట్లోకి వెళ్ళి పోయింది. నడుస్తున్నప్పుడు నాట్యం చేసే ఆమె జడవేపూ, నడుంవేపూ, పిరుదులవేపూ చూస్తూ స్తబ్ధుడై మత్తుగా కూచుండిపోయాడు రామకోటి. గది ద్వారం వరకూ వెళ్ళి సరళాదేవి గిరుక్కున వెనక్కు తిరిగి చూసింది. ఏదో తెలుసుకుందామన్నట్లుగా.

రామకోటి ఇంకా అలా చూస్తూనే ఉన్నాడు.....

0 0 0

ముగ్గురూ భోంచేస్తున్నారు, ఆనందరావు టేబుల్‌కి వెడల్పువేపు ఒక్కడూ కూచున్నాడు; సరళా రామకోటీ టేబిలు పొడుగు వేపు ఎదురెదురుగా కూచు న్నారు. ఆనందరావు తీరుబాటుగా, దర్జాగా, ఆకలిగా తింటూ కోర్టులో అడిగిన

ధోరణిలో రెండువేపులా వున్న యిద్దర్నీ ప్రశ్న లడుగుతూ కాలక్షేపం చేస్తు న్నాడు.

'సో—నువ్వెన్నిగంటల కొచ్చావు, ఇంటికి?' రామకోటిని.

'ఏడుంబావుకి.'

'క్లబ్బుకి పోలేదన్నమాట....!'

'పోలా. అప్పటికే చినుకు లొస్తున్నాయి. ఇహ క్లబ్బూలేదు పాడూలేదని వొచ్చేశా.'

'ఆత నొచ్చేంతవరకూ నువ్వేంజేశావ్?' సరళాదేవిని.

'ఏముందేం మహా, చెయ్యటానికి!—వంట పూర్తిచేసుకుని రేడియో పెట్టుకూర్చున్నాను. అంతలోకే అతను రానేవొచ్చాడు....!'

'ఇహ ఎంతకీ నే రాకపోతే చదరంగం వేసుకున్నారేం?' ఇద్దర్నీ.

'అట్లా యేం లేదు....ఎనిమిదిన్నరకేమో రాంకోటి మెట్లుదిగి వొచ్చాడు. భోంచేస్తాడేమోనని వడ్డించబోయాను. మీరు రాలేదని తను తిననన్నాడు.ఎవడో పార్టీ వొచ్చి ఆఫీసులో పేద్దసీన్ క్రియేట్ చేసేడంటూ అదంతా చెప్పు కొచ్చేడు....ఆ మీన చదరంగం వేసుకున్నాం,' జవాబు చెప్తూ సరళాదేవి రామ కోటివేపు చూసింది 'ఏం, అంతేకదూ?' అని అతన్ని సంప్రదించినట్టుంది, ఆ చూపు సందర్భం.

"చదరంగం వేద్దామని యెవరికి తట్టింది?" అన్నాడు ఆనందరావు, వేళా కోళంగా నవ్వుతూ; వాళ్ళిద్దరూ అలా మొహాలు చూసుకుంటున్నారని.

"ఏమిటి, నీ క్రాసెగ్జామినేషను, చస్తున్నాం!" అన్నాడు రామకోటి నవ్వుతూ.

"అది కాదోయ్-" ఆనందరావు విశాలంగా నవ్వేడు. "వర్షం....ఉరు ములూ మెరుపులూ భయంకరంగా వుంది....నేనేమో నిష్కారణంగా అక్కడ చిక్కడిపోతిని-రిక్షాల వాళ్ళేమో. నీ రూపాయకో నమస్కారం బాబూ మేం రాం పో" అంటున్నారాయె....నేనొచ్చేసరికి మీరిద్దరూ....భోంచేసి వెచ్చగా పడు కొంటారేమో, ఇల్లు ప్రోగ్రాంలేని డ్రామా హాల్లా ఉంటుందేమో భగవంతుడా— అనుకుంటూనే అక్కడ వుండిపోవలిసొచ్చె,-అందుకు—అయామ్ సో గ్లాడ్!— మీ రిద్దరూ మేలుకొని, పైగా భోజనమయినా చెయ్యకుండా నా కోసం యెదురు

చూడ్డం నాకెంత గౌరవం, ఎంత అదృష్టం?" అన్నాడతను. మొదటినుంచీ చివరిదాకా నవ్వుతూ.

ఆ మాటలు అట్లా చెప్పవలసింది కాదనీ, అందులో ఏదో వ్యంగ్యం ఉందనీ అనిపించింది రామకోటికి. "వెచ్చగా" పడుకుంటారేమో అని భయ పడ్డం-భోజనాలయినా చెయ్యకుండా యెదురు చూడ్డం- అదృష్టం. ఇవి సరిగ్గా ప్రయోగించలేదేమో!-అలా కాకుండా "అరెరె, పాపం! నాకోసం నిష్కారణంగా ఆకలితో కూచున్నారా. వెరీ సారీ-" అని ఏదో తేలిగ్గా అంటే బాగుండేదేమో—లాయరు! మాటలకి అర్థాలుంటాయని తెలుసుకోవడం వృత్తిధర్మం. మరి అర్థమున్న మాటలు ప్రయోగించడం యిక్కడ ధర్మమా అనిపిస్తోంది- అతని ఉద్దేశమేమిటో-? ఆ మాటలు సాధారణమైనవిగా తీసుకొనేటంత మూర్ఖులిక్కడ లేరని తెలీదూ?

"ఎన్ని గేమ్స్ వేశారు?" సరళాదేవి నడిగాడు ఆనందరావు.

"లెక్కబెట్టలేదు-" సరళ,

"నువ్వు-?" అన్నట్టు, టీచరు చూసినట్టు, రామకోటివేపు చూశాడు ఆనందరావు.

"మూడు—కాదు నాలుగూ."

"అన్నిసార్లూ నువ్వే గెల్చావుగా."

"లేదు, ఓసారి తను గెల్చుకుంది" అంటూ సరళవేపు చూశాడు రామకోటి. "ఏమిటి, ఇలా అడుగుతున్నాడు, దీనికి అంతూ పొంతూ లేదా?" అన్నట్టుంది ఆ చూపు.

"అబ్బా, ఏమిటి. మీరిద్దరూ?-లేదూ, ఔనూ, కాదూ-! ఇవేనా కబుర్లు?- బోరింగ్."

"భలే! మిరా. మేమా, బోర్ చేస్తోంది?"

"మీరే! ఏమడిగినా సమాధానాలు చెప్పరు, వివరం మాట్లాడరు- మొహాలు చూసుకుంటూ కూచుంటారు'-నాకూ చెస్ తెలుసుగా, చెప్పరాదూ?- పోనీ నేను మా బార్ ఎసోసియేషన్ మీటింగ్ సంగతులు చెబుతానంటే వినరు!- అన్నం తినటం అయ్యేవరకన్నా కాస్త మాట్లాడరాదా యేం, అయినాలస్యం ఎట్లానూ అయిపాయె!"

"ఇప్పుడా సంగతులన్నీ దేనికి లేవోయ్, పదకొండున్నర దాటిందిగా! చప్పున ఫోంచేస్తె పడుకోవచ్చుగదా, చలిగా కూడా ఉంది."

"ఎప్పుడైతే మాత్రం, నాకు తెలీకడుగుతాను, మీ బార్ ఎసోసియేషన్ మీటింగులో ముచ్చట్లు మిగిలిన వాళ్ళకి రుచిగా వుంటాయటండి?" అమాయకం నటిస్తూ అడిగింది సరళ.

"ఉండవు! ఏం చేస్తాం? పాలకోసం రాళ్ళు మొయ్యాలి! నేనున్నంత కాలం నాతోబాటు వార్యూ, బార్ ఎసోసియేషనూ, ఎసోసియేషన్ మీటింగ్సూ, మీటింగు ముచ్చట్లూ అన్నీ వుంటూ ఉంటాయి. నేనేకాదు, నీకూ అంతే.-నీవన్నీ నీకుంటాయి—రామకోటి వన్నీ రామకోటి కుంటాయి—అత నాఫీసులోయెవడో పార్టీ వొచ్చి ఆగంచేస్తె ఆ సంగతి వొచ్చిందా లేదా? మీరిద్దరూ చదరంగం ఆడటం, ఆ చదరంగంలో ఎత్తులూ, ఎత్తుకు పైఎత్తులూ-అన్నీ ఉండాల్సిందే! అట్లా! వుయ్ హేవ్ టు పుటప్ విత్ అవర్ సెల్వ్స్-ఇన్ షార్ట్ ఒకరి న్యూసెన్స్ ఒకరు భరిస్తామని చేసుకునే ఎటర్నల్ అగ్రిమెంటే కదా, మేరేజ్ అంటే! అట్లాంటప్పుడు నా కబుర్లు విననంటంలో జస్టిస్ ఏముంది?"

సరళాదేవి నిస్సహాయంగా రామకోటివేపు చూసింది. ఆమె అట్లా చూడక పోతే రామకోటి పట్టించుకోక పోయేవాడు. వ్యంగ్యం తగిలి గుచ్చుకుంది, ఆ చూపులో తూపు ఎరుపు తెచ్చుకొని—మీరిద్దరూ చదరంగం ఆట్టం, ఎత్తుకుపై ఎత్తూ-ఏం టిదంతా!

కాని అతను తొందరగానే తేరుకున్నాడు.

చిరునవ్వు నవ్వి "-లాయర్ నవిపించుకున్నావోయ్." అన్నాడు.

సరళాదేవికి బలం ఒచ్చింది, దాంతో. ఆమె కూడా నవ్వింది. "కోర్టులో ఈ ధార రాదులే. ఒస్తె నీకు మేం కూడా దొంగ యకౌంట్లు చూపించి లంచా లిచ్చుకోవల్సిందే!" అన్నది.

"ఇస్తూనే ఉన్నానుగా!" పకపకా నవ్వాడు ఆనందరావు—"ఎటొచ్చీ కేష్‌కాదు—కైండ్!"

మళ్ళీ—

'అబ్బ'- ఇవాళ ఎంత అసందర్భంగా మాట్లాడుతున్నావోయ్.' అని నోటిదాకా వచ్చింది రామకోటికి. బలవంతాన నోరు కట్టుగోగలిగాడు....

గుప్తంగా ఉండిపోయిన అశ్లీలాన్ని గుర్తించడం కూడా అశ్లీలతే.... అదట్లా వది లేస్తేనే మంచిది.

o o o

ఎవరు కావాలనుకున్నారు, ఇదంతా?

అప్పట్లో అనుకున్న మాటైతే-సరళే సర్వమని- నిజమే, వ్యవహారంలో ఆనందరావు అడుగు పెట్టాక, ముఖ్యంగా అతను చేసిన ఎప్రోచ్ మాడగానే- చిన్నదైనా శాశ్వతమైన మార్పు ఒచ్చింది. కక్కలేక మింగుకోవలసిన పరిస్థితి ఏర్పడ్డది.

ఇప్పుడతను సరళని ఆ దృష్టితో చూస్తున్నాడా అంటే- అదీ వొక ప్రశ్నే!- అయినా అది చాలా దారుణం—— చూపులూ, ఆలోచనలూ మన కంట్రోల్‌లో ఉండమంటే మటుకు ఉంటాయా? ఒక్కొక్క చూపు అనుకో నంత అన్యాయంగా ప్రసరిస్తుంది. ఒక్కొక్క ఆలోచద అనుకోనంత దారుణంగా మెదడుని క్రాస్‌చేసి జుట్టు నిక్కబొడిపించి వెళ్ళిపోతుంది. దానికీ ప్రవర్తనకీ ఏమీ సంబంధంలేదు. ఆత్మని ఎనలైజ్ చేస్తే ఇవి దొరకవు. ఏదో పని మీద బ్యాంక్‌కి వెళితే ఎవరో చెక్కు మార్చి లెఖ్కపెట్టుకుంటున్న డబ్బు కాజెయ్యాలని. ఎవర్నో రిసీవ్ చేసుకోడానికి రైలుస్టేషన్‌కి వెళితే ప్లాట్‌ఫారం మీద కనబడ్డ అందమైన అమ్మాయిని లేవదీసుకుపోవాలని, అర్ధరాత్రిపూట భార్య పట్ల అన్యాయంగా ప్రవర్తిస్తున్న- మొహమేనా యెరుగని- పౌరుగాయన్ని అప్పటికప్పుడు గోడ పగలగొట్టి చితక్కొడదామని- ఎక్కడో ఓచోట, ఏదో దారుణమైన ఆలోచన కలుగుతూనే ఉంటుంది! మాటల్లో అనువదించి చెప్పడమనే ప్రక్రియ లేకుండా ఆలోచన నిజస్వరూపంలో బైటపడ్డం సంభవమైతే ప్రపంచంలో ఇంత మంచీ, మన్ననా మిగుల్తాయా?, అనేకం అనుకుంటాం, ఒక్కటైనా చేస్తామా?.... చెయ్యడం వరకూ ఎందుకు, చెబుతామా?

వాళ్ళు ఈ ఊళ్ళో ఉండడం: ఆదరం ఫార్మాలిటీ కావడం, ఈ కాక తాళీయపు చెలిమి కలిమి కలకాలం నిలుస్తుందా, కాకుంటే ఏదేనా ఆగిపో తుందా? ఇందులో ఏదీ లేకపోయినా జీవితానికి లోటురాదు! మరి?- ఈ నిరర్ధకమైన అశాశ్వతమైన అర్ధాలు తీసుకోవడం, ఈ అనర్ధాలు ఎందుకని?

సరళ....తను ఏ క్షణం ఆమెని బలాత్కరిస్తాడో అన్నట్టు చూస్తున్నట్టుంటుంది....ఆమె చనువూ ధైర్యం మేకపోతు గాంభీర్యంలాగా.... పిరికితనం

సంస్కార లక్షణం కాదు....తనని చూడగానే ఆయనింట్లో పేరు రాంకోటీ, తర వాత రా: అనే సరళ సంస్కారంలో తనకి నమ్మకం కుదరదు!——.... ఆమె మాటలు— అప్పుడప్పుడు ఏదో అంటూనే వుంటుంది, వ్యంగ్యంగా— నాకు ప్రాబ్లెమూలేదు, నువ్వు సాల్వొ చెయ్యనక్కర్లేదు!—ఏమో, ఆలోచించకుండా వొచ్చిన మాటలేనేమో?

మరి అతనో?— అతనేది మాట్లాడినా రెండేసి అర్థాలు సుళువుగా తియ్యొచ్చు'— ఇట్లా ఎందుకన్నావు, దీనర్థం యిదికాదా, అని నిలదీస్తే?— అబ్బే, అదేమిటి; నేనట్లా అనుకొని అన్లేదు, నీ కిట్లా తోచిందా?— ఈ పాడు అర్థం నీకే తోచిందా, ఎవరన్నా చెప్పారా? అని తేలగొట్టే హక్కు వుంది, చాతు ర్యమూ వుంది అతనికి!

—సరళని తనకిచ్చి పెళ్ళి చెయ్యనని వాళ్ళమ్మ చెప్పగానే తనదార్ని తను పోయి ఆమెని మరిచిపోయుంటే?— చాలా అన్యాయమైన ఆలోచన. కాని అట్లా చేసుంటే ఆమె ఎక్కడుండేదో. ఎట్టా వుండేదో, ఎవర్ని పెళ్ళాడేదో! —అయినా ఆనందరావు కామెని చూసించడం, అదంతా చెప్పడం, అతను పెళ్ళాడతానంటే చేసిన సారధ్యం, ఆ సారధ్యంలో స్వార్థ త్యాగాడంబరం,— తన నిలాగా శిక్షించడం? ఇట్లా వెంటాడి వెక్కిరించి వోడించడమా?

ఇది చాలా అనవసరం....దీనికి ఫుల్‌స్టాప్ పెట్టేందుకు ఏదేనా చెయ్యగలి గితే బాగుణ్ణు....

o o o

భోజనం పూర్తిచేసి, తమలపాకులు వేసుకోకుండా చకచకా మేడ మెట్లెక్కి వెళ్ళిపోయాడు రామకోటి.

"వక్కపొడైనా తీసుకోవేం?" అంది సరళ. హాలుదాకా వచ్చి, అత న్నుద్దేశించి.

అతను వినిపించుకునీ కూడా వెనక్కిరాలేదు.

"వక్కపొడేం ఖర్మం!....కిల్లీ వే యిద్దాం ఉండు!....మనకి అతన్తో పనుంది!" అన్నాడు ఆనందరావు, ఆమె వెనకే హాల్లోకొచ్చి.

సరళ అతని మొహంలోకి చూసింది.

వంకీనున్న కోటు జేబులోంచి వో పొట్లాం తీసి, మూడు కిల్లీలు తీశాడు

ఆనందరావు. "ఇందాక, వర్షమప్పుడు.... ఆ కిల్లీ దుకాణం దగ్గర నిలబడి జాతా ఖానీ కొడుతూ వుంటే, దుకాణం అతనిచ్చాడు!" అన్నాడు; దుకాణం అతను ఏదో ఫ్రీగా ఇచ్చినంత దర్పంగా.

"నా కక్కర్లా!" అంది సరళ, మూతిముడిచి.

"ఏమో-?"

"నల్ల కోట్లో వేసి తెస్తారు; కిళ్ళీలూ, పువ్వులూ, స్వీట్సూనూ!.... ఎట్లా తాకబుద్ధౌతుందేం-? ఛీ, పాడు!"

ఆనందరావు పకపకా నవ్వాడు. తమ యిద్దరి మధ్య అలవాటయిన చనువైన ధోరణి అంది పుచ్చుకుని అన్నాడు;

"—నల్ల రంగులో మహిమ తెలియక దాన్నట్లా చిన్నబుచ్చుతున్నావు సరళా! అంతే.... ఇట్లా చూడు, నా కళ్ళల్లోకి! నల్లనివాడు పద్మ నయనమ్ములవాడు!!.... ఆ రష్యా అమెరికా పర్యంకం కావ్యాల దగ్గిర్నుంచీ కాస్మిక్ సైన్సెస్ వరకూ నల్లని అచ్చులో కదంటే, వేస్తారు! నల్లని రాత్రిలోనే చల్లని అల్లర్లు జరుగుతాయన్నది తేటతెల్లం కదే. పిల్లా! లాస్ట్ బట్ నాట్ లీస్ట్!— నల్లకోటు న్యాయానికి నిజానికి ప్రతినిధని తెల్లవాడే ఒప్పుకొని ఫిక్స్ చేసేడు సరళా!"

ధోరణిలో చనువూ, మెత్తదనం సరళని స్వాధీనపర్చుకోగా ఆమె కళ్ళనిండా ఆహ్లాదం నింపుకొని, నోరు నిండుగా తెరిచింది, ఆనందరావు కిళ్ళీచుట్టూ వున్న కాగితాన్ని సుతారంగా, ఆలస్యంగా తెరుస్తూ ఆమె నోటిని సాధ్యమైనంత సేపు తెరిపించి ఉంచినట్టు ఆ చర్యద్వారా వ్యక్తంచేసేడు, తరవాత అతను కిళ్ళీ ఆమె నోటిలో స్వయంగా వుంచాడు. ఊరించి నోరు తెరిపించి ఉంచినందుకు కసితో లటుక్కున అతని వేలు కాటు వెయ్యబోయింది సరళ. ఆనందరావు తెలివిగా చటుక్కున లాగేశాడు.

నవ్వుతూ- "పద మీ ఫ్రెండు నిద్రబోతాడో యేమో! అతన్తో పనుంది నాకు!" అన్నాడతను, ఆమె నడుంమీద చెయ్యేసి లాక్కెళుతూ.

"నేనుకూడా యెందుకులే, మీరెళ్ళండి—ఊళ్ళో పన్లన్నీ నిశిరాత్రివరకూ ఒక్కళ్ళూ చక్కబెట్టుకొస్తారుగానీ, మా ఫ్రెండు దగ్గిర ఇంతపని బడేసరికేమో నేను గావాలి!" అని మురిపించి వెనక్కి బరువు వేసింది సరళ.

"పోనీవోయ్! రేపట్నుంచీ ఊళ్ళో పన్లకికూడా నువ్వు సాయం ఒస్తే పోలా!" అంటూ మరి కొంచెం బలంతో ఆమెను నెట్టుకుపోయాడు ఆనందరావు.

వాళ్ళిద్దరూ వెళ్ళే సరికి రామకోటి మంచంమీద పడుకొని వున్నాడు. టేబిల్ లైటు వేసుకొని నిద్రకోసం ఏదో మేగజైన్ తెరిచి చూస్తున్నాడు. వాళ్ళని చూడగానే అతను మంచంమీద లేచి కూర్చుని ట్యూబ్‌లైట్ స్విచ్ వేశాడు. ఆనందరావు కిళ్లీ యిచ్చాడు. అతను "థేంక్స్" అని నోట్లో వేసుకున్నాడు.

"కూర్చోండి!" అన్నట్లు ఎదురుగావున్న సోఫా చూపించేడు రామకోటి.

"కూర్చోటం గాదు నువ్వే లేచిరావాలి.... ఆ రాజమ్మగారి ట్రంకుపెట్టెలు —(రేదర్) భోషాణాలు -కింది వసారాలో పెట్టాలి."

"ఇప్పుడా? పొద్దున పెట్టరాదూ?"

"లేదులేదిప్పుడే.... ఇంతకుముందు నన్ను కార్లో డ్రాప్‌చేసి వెళ్లాడుగా. అతను రాజమ్మగారబ్బాయే.... పొద్దున నాలుగ్గంటలకు లారీ తీసుకు వస్తాట్ట. అప్పుడు మళ్ళీ నువ్వు నిద్ర లేవటం దేనికి!—ఎట్లాగో యిప్పుడే కింది వసారాలో పెట్టేస్తిమా, పొద్దుట వాళ్లు లారీ కెత్తుకుపోతారు."

రాజమ్మగారు ఇంటి వోనర్. రెండు భోషాణా లంతేసి ట్రంకుపెట్టెలు పూర్వం ఆనందరావు మేడమీది వాటాలో ఉండే రోజుల్లో అతని కష్టడీలో వుంచేరు. బరువూ, ఎవరైనా మేడమీది వాటాకొచ్చాక అంతగా తీసెయ్యమంటే అప్పుడే తియ్యొచ్చులే అని వుంచేసిన పెట్టెలు; ఆ వాటాలోకి రామకోటి రావడాన్నీ, అంతగా ఖాళీ చెయ్యవలసిన వొత్తిడి లేకపోవడాన్నీ అక్కడే విడిచి పెట్టేశారు.

"సరే, పద!".

ముగ్గురూ మధ్యగదిలోకి వెళ్లారు. ఆ పెట్టెలమీద ఏవో చిల్లర వస్తువులుంటే తీసేశాడు రామకోటి. వెంటనే ప్రక్కనున్న హేండిల్స్ పట్టుకొని పెట్టె ఎత్తడానికి ప్రయత్నించాడు ఆనందరావు. "ముదనష్టం పెట్టె! ఆ రాజమ్మకంటే బరువుగా వుందే దీని సిగ్గొయ్య!" అన్నాడు.

రామకోటి నవ్వాడు. "ఆమెనికూడా వోసారి ఎత్తుకుని చూశావట్టుందే!"

"ఆమెనా?-ఎత్తుకుని చూడాల్సిందేగాని ఈమె యామంటుందోనని ఊరుకొన్నా." ఆనందరావు సరళకేసి చూసి నవ్వుతూ అన్నాడు...." అట్లా వూరికే చూస్తూ నుంచోకపోతే వోచెయ్యి వెయ్యరాదు?"

"ఎందుకులే; వుండు!" రామకోటి అవతలి గొళ్లెం పట్టుకుని ఎత్తి "ఇప్పుడు లేపు." అన్నాడు.

"ఇందులో ఏం పెట్టిందబ్బా; ఇంత బరువుంది!" అన్నాడు ఆనందరావు. నాలుగడుగులు నడిచారు; "అబ్బా!నా చేతులు నొప్పుతున్నాయ్. ఉండుండు....దించుకొంటా!" అన్నాడు.

అరిచేతులు రెండూ వొకదాంతో వొకటి రాసుకుంటూ నోటితో వూదుకుంటూ "అబ్బా ! ఎట్లా కందినయ్యో;" అన్నాడు ఆనందరావు. "ఇదే పూర్వకాలంలో అయితేనా?" అన్నాడు సరళకేసి చూస్తూ.

సరళ నవ్వుకుంటూ అన్నది; "నాధా! మీసుకుమార హస్తంబులు నొచ్చుచున్నవా?-అయ్యో! ఈ పాపిష్టి కన్నులతో ఎట్టి విపత్కర దృశ్యము జూడవలసివచ్చె!-ఈ సమయంబున నుపయోగపడని నా యీ పెర్లిన్‌చీర యేల; కాల్చనా? -హా! దుర్విధీ!?"

"ఆగాగు: నాకో అయిడియా తట్టింది!" అన్నాడు ఆనందరావు. "ఇక్కడే ఉండండి" చరచరా క్రిందికి వెళ్ళాడు.

రామకోటీ సరళాదేవి అతను వెళ్తున్న వేపుకి క్షణకాలం ఆశ్చర్యపడుతున్నట్టు చూసేరు. వెంటనే ఒకరి కళ్ళలో కొకరు చూసుకొని, వెనువెంటనే చూపులు మళ్ళించుకున్నారు.

పదిహేను సెకన్లు గడిచాయి. ఎక్కడో గడియారం పన్నెండు గంటలు కొడుతోంది....వులిక్కిపడ్డా రిద్దరూ, అనుకోకుండా, అనవసరంగా అర్ధరాత్రి పన్నెండు కావడం. అప్పుడు మెలకువగా వుండడం; విశేషించి ఏకాంతంగా ఉండడం; వారిద్దరికీ ఇదివరకెన్నడూ జరగకపోలేదుగాని, ఇందులో ఏం ప్రత్యేకత లేనట్టు గుర్తించే చైతన్యం ఒకరికీ కలగలేదు....మళ్ళీ యిద్దరూ మొహాలు చూసుకున్నారు.

సరళాదేవి తనవేపు చూడగానే, భోజనం దగ్గిర ఆనందరావాడిన మాటలు జ్ఞాపకం వొచ్చాయి రామకోటికి. వాటిని గురించి ఆమెతో చర్చిద్దామన్నంత ప్రేరణ కలిగింది. కాని అదీ మంచిదిగాదన్న నిశ్చయాన్నికూడా వెంటనే వచ్చేశాడతను....ఎంతైనా వాళ్ళిద్దరూ వొకటి, తను వేరు!—భరించటమే సభ్యత! నీచమైన భావాన్ని మనసులో చర్చించడం కంటె బహిరంగంగా చర్చించడమే యెక్కువ నీచంగా పరిగణించబడుతోంది....ఆ సంగతి గుర్తించి భయపడి అతను బొమ్మలా నిలబడి బాధపడసాగాడు.

రామకోటి అలా నుంచోడం చూసి సరళ ఏమీ తోచనిదాన్లా అయి

పోయింది. ఓసారి ఆ పెట్టె హేండిల్‌లో చెయ్యిమార్చి ఎత్తబోయింది. పెట్టె కదల్లేదసలు. "అబ్బ! ఏం దాచిందో, ఇందుట్లో" అంది.

ఆమె పైటచెంగు బిగించుకోడం, వంగోడం దగ్గర్నుంచీ హేండిల్లోంచి చెయ్యి తీసెయ్యడం వరకూ అన్నీ చూసి; ఆమె విడుస్తున్న నిట్టూర్పు దగ్గర్నుంచీ అన్నమాటవరకూ అంతా వినికూడా, సమాధానం చెప్పక్కర్లేదన్నట్టు నుంచున్నాడు రామకోటి.

ఒకసారి ఆమెవేపు చూసి వెంటనే ఇద్దరిమధ్యా నిర్జీవమైనా శక్తివంతంగా పడున్న ఆ పెట్టెవేపు చూశాడు రామకోటి. తామిద్దర్రూ ఇంత నిశ్శబ్దంగా ఉండవలసిన పరిస్థితికాదు; అప్పుడూ ఇప్పుడూ కూడాను; కాని నే దేదో జరగరానిది జరిగినట్లు, తన్మూలంగా, అనే ప్రతీమాటా అశ్లీలమై పోతుందేమో అన్నట్లూ ఇద్దరూ సంకోచిస్తూ వుండడం అతన్ని చాలా దుఃఖపెట్టింది. ఇంతలా నేరంలేని శిక్ష కెవ్వరూ అంగీకరించలేరు.

సరళాదేవి కేమీ తోచలేదు. ఆమె రెండో పెట్టె దగ్గరకెళ్ళింది. అది ఎత్తుదామనో, ఏమో. ఆమె ఉద్దేశం ఆమెకే తెలియదు!....

చప్పుడైంది — ఆనందరావు కాళ్ళూ గొంతూ చప్పుడు చేసుకుంటూ ఎవరో పిలుస్తున్నట్టు; "ఆఁ.... వొచ్చేస్తున్నా" అంటూ వొచ్చాడు.

"అట్లా యెందుకూ, గొడవచేసుకుంటూ రావటం? —అతను లేని యీ ఒక్క నిమిషంలోనూ మనం యిద్దరం ఏమన్నా-?" అన్నట్టు, సరళాదేవి అతని గొడవైనా భరించగలదుగాని నీ చూపు భరించలేనన్నట్లు భయంగా చూస్తూ చీర చెంగు చేతుల్లో జోరుగా మెలితిప్పేస్తోంది.

"అట్లా టెరిలిన్ చీరలు మెలితిప్పకోరు ఫ్రెండూ- పూర్వకాలంలో నూలు చీరలట్లా-" అని సరళాదేవిని వేళాకోళం చేసి, ఆనందరావు; "ఇదుగో రాంకోటీ;— ఈ గుడ్డచేతికి చుట్టుకొని ఎత్తు, ఇది నీకు; యిది నాకు!" రెండు మాసిన తుండు గుడ్డలు తెచ్చాడు; అవి పంచాడు యిద్దరికీ.

గుడ్డలు చేతులకి చుట్టుకున్నాక పని తేలికైంది.

మెట్ల చివరిదాకా దిగేసిన తర్వాత "అమ్మయ్య!" అన్నాడు ఆనందరావు.... "భలే చావొచ్చి పడిందే, దీందుంపతెగా!"

రెండో పెట్టె ఇంకా కొంచెం ఎక్కువ బరువే అనిపించింది, ఈసారి ఆనందరావు ముందుగా దిగుతున్నాడు మెట్లు.

"పాత పగలుంటే బలే తీర్చుకో వచ్చులే, ఈ పెట్టెత్తో!.... ఏముందీ, ఆ మెట్లు టర్నింగ్ తిరిగిన దగ్గర కాస్త వెనక "హేండిల్ ఒదిలిపెట్టేది— దెబ్బతో సాఫ్!-" అన్నాడు ఆనందరావు నవ్వుతూ. "జాగర్త సుమా రాంకోటి; టర్నింగ్ దగ్గిర కొస్తున్నాం, హేండిల్ ఒదిలిపెట్టావంటే యింకేంలా.... ఒక్కసారిగా అడ్డుతీరిపోవాల్సిందే!"

"అంత సుళువుగా ఎట్లా తీరిపోతాయి, అడ్లు? అవతల నా పెళ్ళామో-?" అనుకున్నాడు రామకోటి.

అనుకోడమేమిటి, ప్రమాదవశాన అతని చెయ్యిజారిపోవడమేమిటి!- పెట్టె ధడ్మని ఆనందరావు మీదికి తూలింది. మోకాళ్ళ మీద అంచు బలంగా ఆనుకొని, ఆ దెబ్బకు చతికిల పడిపోయాడు. కూర్చున్న మనిషిమీద పెట్టె బరువంతా ఆనుకోగా అతను తట్టుకోలేక, క్రింద మెట్టుమీదికి, తరువాతి మెట్టు మీదికి, ఆ తరువాతి మెట్టుమీదికి, దాంతరువాత మెట్టుమీదికి, అట్లా, ఒరిగి, జరిగిపోవడం, పెట్టెకి వేరే ఆధారంలేక పెనుభూతంలా ఎప్పటికప్పుడు మీద పడుతూ వుండడం!- ఒళ్ళు, పెట్టెకీ గోడలకీ మధ్యపడి నలిగిపోవడం ఇలా జరిగిపోతోంది.

ఇంతలోకే తన చేతులు స్వాధీనంలోకి తెచ్చుకొని, అతన్ని కాపాడదామని ఆదుర్దాగా వొస్తున్న రామకోటి మొహంలో, ఈ హత్యాకాండ పూర్తి చేసేందు కేర్పడిన క్రౌర్యం కనబడింది ఆనందరావుకి. ఆ గాభరాలో, ప్రాణ రక్షణకోసం జీవిచేసే అంతిమప్రళయ ప్రయత్నంలో, ఆనందరావు పెట్టె హేండిల్లోంచి చెయ్యి వదలడం, పెట్టె జోరుకన్నా రెండడుగులు ఎక్కువగా వెయ్యడం; పెట్టె అతనికి మూడు మెట్లు మీదుగా అస్తవ్యస్తంగా నిల్చిపోవడం జరిగాయి. పడ్డపాటూ, తిన్నదెబ్బలూ, అనుభవిస్తున్న అవమాన రోషాలూ, ఆవహించిన మృత్యుభయం, ఆనందరావు ముఖాన్ని చాలా వికృతంగా చేశాయి.

"సారీ ఆనంద్: పొరపాటైంది, చెయ్యి జారింది." అన్న రామకోటి మాటలు అతనికి వినిపించలేదు. అతను నిటారుగా నుంచొని చొక్కా జెబ్బల మీదికి లాక్కుని, పిడికిలి గట్టిగా బిగించి "ఏరా!" అని ఊపిరి పీల్చి మూతి బిగించాడు. రామకోటి తనకి అందీ అందనంత దూరం రాగానే అతని మీదికి లంఘించి, "కావాలనే చేస్తావుగా!.... రాస్కేల్?" అని మాట కొక గుద్దు

చొప్పున, పెకండు కొక గుద్దు చొప్పున, మొహంమీద, మెడమీద బలంగా గుద్దేశాడు. రామకోటికి ఆశ్చర్య పడేటందుకు టైమ్‌లేనట్టు స్ఫురించింది. ఆరో పణలో దూషణకంటె, అఘాతంలో శిక్ష బలంగా తగిలి, అతన్ని మరుక్షణం ప్రతీకారానికి పురికొల్పింది.... అతను ఎడం చేత్తో ఆనందరావు జుట్టుపట్టుకుని, కుడిచెయ్యి పిడికిలి బిగించి అతని డొక్కలో బలంగా పొడిచాడు.

"అమ్మా!" అన్నాడు ఆనందరావు "అవకాశం కోసం చూస్తున్నావురా!.. ఇడియట్!" అని అతను మళ్ళీ తిరగబడి రామకోటి వీపుమీద, నెత్తిమీద, రెండు గుద్దులు వేశాడు, రామకోటి కిందబడి, మళ్ళీ లేచాడు. రెండుచేతులూ కలిపి వాలీబాల్ ఆడినప్పట్లా బాదసాగాడు.

నిర్ఘాంతపడి చూస్తున్న సరళ, చూస్తున్నది నమ్మలేనంత చిత్రంగా, అసహ్యంగా తోచి మేడ వసారాలో పిట్టగోడ ప్రక్కన వొక్కక్షణం అట్టే నుంచుంది. చకచకా మెట్లుదిగి వచ్చేలోగా ఆమెకి భోరున ఏడుపొచ్చేసింది. "అమ్మో!.... ఇద్దరూ బలిష్ఠులు; ఆరోగ్యవంతులు. పొట్టేళ్ళలా ఢీ కొంటు న్నారు. వాళ్ళని ఎవరేనా ఆపగలరా? ఆ మధ్యకి వెళితే ప్రాణాలు పోతాయేమో? పోతే పోనీ!".... ఏడ్చేస్తూ సరళ- వాళ్ళిద్దరూ మళ్ళీ తలపడే వేళకి ఇద్దరి మధ్యా యిరుక్కొని, రెండు చేతులు బారజాపి, యిద్దర్నీ కౌగలించుకొంది. "బాబోయ్ ఆపండి, నే చచ్చిపోతా!" ఆని పెద్ద కేక పెట్టింది: ఏడుస్తూనే,

ఆనందరావు యిక తట్టుకోలేని నీరసంలో ఆమె మీద ఒరిగాడు.

రామకోటికి తెలివొచ్చింది.... త్రిభుజం మూడు బిందువులూ ఒక్కచోట కలుసుకున్నాయి. నూటఎనభై డిగ్రీలు మూడువందల అరవై అయ్యాయి, అక్కడున్నది వొక ఆడదీ, ఆమె భర్తా, ఆమె మాజీ ప్రేమికుడూ కాదు.... ఆమె స్పర్శలో తల్లీ, చెల్లీ, పెళ్ళాం, పిల్లా ఒక్కసారే చూపట్టేరు. ఆత్మ చేసిన పరాభవాగ్నిలో అతను దగ్ధమై పశ్చాత్తాప తేజస్సులో పునఃప్రభవిం చేడు.... వెంటనే ఆమెని ఆ త్రిహృదయ పరిష్వంగంలోంచి తప్పించాడు. "లే సరళా" అన్నాడు మెత్తగా- సరళ అనుమానంగా చూసి అంతలోనే నమ్మకం తెచ్చుకొంది.

మరుక్షణంలో అతను ఆనందరావుని ఎత్తుకొని, మోసుకొని, పడక గది లోకి తీసుకుపోయాడు.... సరళ కంగారుగా అతన్ని ఆనుసరించింది. రామ

కోటిని ఉద్దేశించి తిట్లూ, కృతజ్ఞతా వాక్యాలూ ఆమె గొంతులో కలగాపులగంగా గుర గుర మంటున్నాయి. ఒక్కటీ బైటి కూడిపడ్డంలేదు.

మంచంమీద పడుకోబెట్టాడు ఆనందరావుని. పెట్టెకీ, మెట్లకూ, గోడకూ మధ్యపడి, నలిగిపోయిన గీరుకుపోయిన అతని చర్మ భాగాల్ని చేత్తో నిమిరాడు. స్రవిస్తున్న రక్త బిందువుల్ని అరిచేత్తో తుడిచేశాడు తొందరగా. క్షణంలో సగంసేపు సరళవేపు చూసి, "దూది, అయోడీన్ ఉండాలే, తెలుసా?- తే." అన్నాడు.

సరళకి జవాబు చెప్పడానిక్కూడా తోచలేదు. ఇక్కడ నీ చేతుల్లో ఈయన్నొదిలి నే వెళతానా అని మూర్ఖంగా క్షణకాలం నుంచుని, అలాంటి భావం కలిగినందుకు సిగ్గు పడింది. రామకోటి కిదంతా తెలుసా అన్నట్టు అతని కళ్ళల్లోకి భయంగా ఆందోళనగా చూసింది. రామకోటి పైజమా జేబులోంచి రుమాలు తీశాడు, చించేటట్టు పట్టుకున్నాడు, ముక్కలుగా చింపుతాడని స్ఫురించగానే తన చీరవేపు చూసుకుంది సరళ. క్షణకాలం ఆమెకి కొద్దిసేపటి క్రితం తా నాడిన మాటలు వృథాగా జ్ఞాపకం వొచ్చాయి. అశుభం సూచించినానేమో అని అనుమానం కలిగింది. ఇంతకీ సరైన సమయంలో చీర చించి గాయాలకి కట్టేందుకు ఉపయోగించలేక పోతున్నానే అని చిన్నబుచ్చుకుంది. ఇదేమిటీ నీరసం అని హేళన చేసుకుంది:- చివరికి ఆ అనవసర ప్రసంగంమీద, అంతకంటే అనవసరమైన ఈ సంఘర్షణమీద అసహ్యంవేసి, తనమీద తనకే విసుగు పుట్టింది, ఆ విసుగులో చిరాకుపడి, అలమారు దగ్గరకెళ్ళి, తలుపు తెరిచి, బాక్సులో దూదీ, అయొడిన్, పుడకా తెచ్చింది.

గాయాలన్నీ వోపిగ్గా తెరిచి, ఒక్కొక్కదానికే శ్రద్ధగా అయొడిన్ పూశాడు రామకోటి .... ఒళ్ళంతా నెప్పులుగా ఉంది, మధ్య మధ్య తడుముకుంటూ సిగ్గుపడ్డాడు .... అయినా చేసేదేం లేదు...."మొహం పగలకొట్టాడు ఆనందరావు!"....కళ్ళకింద చర్మం పొంగి, కళ్లకే కనబడిపోతోంది....అటు చూస్తే, అలా అనుకుంటే, కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి .... తుడుచుకోడానిక్కూడా టైమ్‌లేదు.... వ్యవధివున్నా, సమయం కాని సమయం....

ఆనందరావు గాయాలపని అయిపోగానే మాట్లాడకుండా బైటికొచ్చేశాడు రామకోటి. అతనేమైనా చెబుతాడేమో! అతనికేమైనా చెప్పాలో యేమో, ముఖ్యంగా అతని దెబ్బల మాటేమైనా చూడాలేమోనని, సందేహంగా, అను

మానంగా, ఆశగా, అతనివేపు చూస్తూ అతని ప్రతీ చర్యనీ గమనిస్తూ అలా నుంచుండిపోయింది సరళ....చివరికతనేమీ మాట్లాడకనే వెళ్ళిపోయేసరికి, ఆమె చాలా చిన్నబుచ్చుకుంది, అవును! నా అంత వ్యర్థురాలి కోసం చావు దెబ్బలు కొట్టుకొని, ఇంకా నన్నీ మొగాళ్ళిద్దరూ ఏం గౌరవిస్తారు - అనుకొంది. మరు క్షణంలో ఈ ఆత్మనిందకు ఎంతో ఖేదపడింది ఆమె.

మేడ మెట్ల దగ్గరకొచ్చాడు రామకోటి. మూడో మెట్టుకీ, నాలుగో మెట్టుకీ, మధ్య, రెండింటిమీదా ఆ బరువైన ట్రంకుపెట్టె అడ్డంగా అస్తవ్యస్తంగా పడి వుంది. దాన్నలా వదిలి తన దారిని తను పోలేక పోయాడు. తెల్లారుజామున వాళ్ళొస్తారు, ఇది గమ్యస్థానానికి రెండడుగులు ముందుగానే ఆగిపోడం గురించి వాళ్ళు ఏదేనా ఎందుకు అనుకోవాలసలు ? - అని. ఒక్క చేతిమీదుగానే పెట్టెని ఈడ్చేసి, దిగువకి లాగి, మొదటి పెట్టె వుండేవేపు తోసేసాడు. పెద్ద చప్పు డైంది, చేతినిండా దుమ్ము - రక్తం మరకలు....

హాల్లో వాష్‌బేసిన్ దగ్గరకెళ్ళి, అద్దంలో చితికిన, పొంగిన, తన మొహం చూసుకుంటూ, సబ్బురాసి చేతులు కడిగేసుకున్నాడు! అద్దంలోంచి, గదిలో మంచం కనిపిస్తోంది, సరళ, మంచంమీద ఏటవాలుగా కూర్చునివుంది. ఆనంద రావుతలని ఆమె తన రొమ్ముమీద పెట్టుకొని, అతనివీపుమీద నిమురుతోంది.... అద్దంలో చూసిందీ, బైట చూసేదీ వొక్కటే .... అయినా అతను గదివేపుకు తిరిగి, క్షణకాలం, ఆ సుందరదృశ్యాన్ని తనకి చేతనైనంత ఎప్రీసియేషన్‌తో చూశాడు. .... ఆ వక్షంమీద విశ్రాంతి తీసుకునేతల .... ఎన్నివేల విలువ చేసునో !!

0 0 0

తెల్లవారింది.

రామకోటి డ్రెస్ చేసుకున్నాడు. ప్రొద్దున్నే ఎక్కడికీ వెళ్ళే అలవాటు లేదు.... చేసుకోవాలి అలవాటు....ఈ కాఫీలూ భోజనాలూ మానేస్తే — చాలా మాఁంగా ఉండొచ్చును ! .... తన ప్రశ్నకి ప్రమాదంలేని పద్ధతిలో సమాధానం కుదిరినట్టు తాత్కాలికంగా తృప్తిగా ఉంది.... రేపణ్ణుంచీ ఫ్యాన్‌ని పొద్దుటే ఆరింటికి రమ్మని చెప్పాలి,

మెట్లు దిగుతూ వోరగా చూశాడు, ఆనందరావు గదిలో కూర్చున్నాడు అతన్ని చూసి వెళ్లాలిసిందే.

"గుడ్ మార్నింగ్, రా!" అన్నాడు ఆనందరావు, చిరునవ్వుతో. "అయామ్ సారీ, రాంకోటీ!— ఇద్దరి కిద్దరం అంత బ్రూట్స్‌లా ప్రవర్తిస్తామనుకోలేదు... చదువూ సంస్కారం ఒక్కసారి ఎక్కడికి పోయినయ్యో-ఆశ్చర్యం !"

రామకోటి రెండు ట్రంకుపెట్టెలు నెత్తిమీంచి దిగినంత రిలీఫ్ పొందేడు. అతని మొహం నవ్వు పోసుకొంది.

"అంటే-ఆ మాత్రం పోట్లాడే శక్తికూడా, ఐమీన్ ప్రాక్టీస్- ఉండా లేమో ?"

"చాలా థేంక్స్‌య్ .... రాత్రి చాలా శ్రమపడ్డావు, ఈగాయాల కోసం!"

మళ్ళీ శ్లేషా? — ఛీ ! — ఇది తన వ్యాధేనేమో ఒకవేళ! — రామకోటి నో మెన్షన్ చెప్పడం మరిచిపోయాడు.

గదిలో అలికిడి విని, సరళాదేవి గది గుమ్మందాకా వొచ్చి తొంగి చూసింది. ఆమె తొంగిచూడ్డం రామకోటి చూశాడు. ఎవరి కళ్లల్లోనూ ఏ భావం లేకుండా మళ్ళీ చూపులు కలుసుకున్నాయి. ఏదో పని స్ఫురించి సరళ లోపలికెళ్లింది.

"అట్లా బైటికి పోయొస్తా" లేచి వెళ్లాడు రామకోటి.

సరళ డైనింగ్ హాల్లోనించివస్తూ అతన్ని చూసింది. పిలవడాని కామెకి నోరు విడలేదు. కంగారుగా సరాసరి గదిలోకి వెళ్ళిపోయింది, భర్తతో చెబుదామని. కాని తీరా అక్కడికెళ్ళాక ఆయనతోనైనా ఎట్లా చెప్పాలో తెలియక, అతనివేపు తెల్లమొహం వేసి చూస్తూ నుంచుంది.

అతను చూశాడు - కాని ఏమిటలా ఉన్నావని అడగలేదు. పది పదిహేను సెకన్లు ఆగింది.

"రాంకోటి —" అని గోడవేపు తిరిగిపోయింది సరళాదేవి-"హోటలుకి పోతున్నాడు కాఫీకి!"

"అరెరె !" అని నవ్వుకుంటూ లేచాడు ఆనందరావు. కుంటుతూ అయినా చకచకా నడిచి వెళ్ళాడు. గేటు దగ్గిర రిక్షాపిల్చి నుంచున్న రామకోటిని కలుసుకున్నాడు, నడుంమీద చెయ్యేసి అతన్ని పట్టుకుని. మృదువుగా "లోపలికిరా రాంకోటీ." అన్నాడు - లాక్కొచ్చేశాడు — ఇద్దరూ వరండాలో కొచ్చారు,

"వొదిలిపెట్టు, గిలిగింత లవుతున్నాయి,"

నడుం ఒదిలిపెట్టి చేతులు రెండూ పట్టుకున్నాడు ఆనందరావు- "రాత్రి ఏదో నిషాలో — బ్రూట్స్ అయ్యామని — పగలు — ఇప్పుడు కూడానా రాంకోటీ!"

"ఏదో కాలు జారింది. తీసుకున్నాం - మనిద్దరం; పోనీ మనం ముగ్గురం నోరుజారితే ఎంత ఆక్వర్డుగా వుంటుందో నేన్నీకు చెప్పాలా రాంకోటీ-చెప్పు? మన మధ్య ఏం జరిగిందంటావు, అసలు?"

ప్రతిమాటా రామకోటి మనస్సును సున్నితంగా తాకింది. స్నేహంతో మత్తెక్కిన అతని మనస్సులో, ఆ మాటల్ని వేరే విధంగా అర్థం చేసుకోడానికి కావలసిన రెసిస్టెన్స్ లేదు.

"అవును —— ఏమీ జరగలేదు."

మళ్ళీ నడుంమీద చెయ్యివేసి, తన నడుంమీదుగా అతనిచెయ్యి లాక్కుని గది గుమ్మందాకా తెచ్చి విడిచాడు ఆనందరావు. చాలా మర్యాదగా. "ఇదుగో నమ్మా, నీ మిత్రుడు, నువ్వు నావల్ల అతన్నెప్పుడూ పోగొట్టుకోలేవు" అన్నాడు. సరళ ఇటు తిరుగుతూనే రామకోటి కళ్ళలోకి చూసింది కృతజ్ఞతతో, స్నేహాభిలాషతో, ఆమె కన్నులు మెరుస్తున్నాయి, చెమరుస్తున్నాయి.

"కాఫీకి లేటయ్యావు రాంకోటీ! వెళ్లు!" అన్నాడు ఆనందరావు, మంచం ఎక్కి న్యూస్ పేపర్లో మునిగిపోతూ.

0 0 0

రెండు నిమిషాల తరవాత డైనింగ్ టేబిల్ దగ్గర నుంచుంది సరళ. ఎదురుగా కుర్చీలో కూర్చుని రామకోటి టిఫిన్ తింటున్నాడు. ఆమె అతన్ని చూస్తూ తనని తాను చూసుకుంటోంది.

"——ఇంకా ప్రేమిస్తున్నాడు. నన్ను! - నన్నే కాదు, నన్ను పెళ్ళాడిన వాణ్నికూడా ప్రేమిస్తున్నాడితను! —— నన్ను క్షమించాలి రాంకోటీ - నీ విషయంలో దిద్దుకోలేని పొరపాటు చేసేను.-రాత్రి నీకు జరిగిన అన్యాయాన్నీ, నీ మీద పడ్డ ఆరోపణనీ మరిచి మళ్ళీ ఈ జన్మలో నన్ను నీ మనస్సులో పెట్టుకుంటావనుకోలేదు.—— నిన్ను పోగొట్టుకోడానికి నా కెన్నడూ బలం చాలదు. నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోకు రాంకోటీ-"

హటాత్తుగా రామకోటి తలెత్తి చూశాడు. అతననుకున్నది నిజమే. ఆమె చేతిమీద రాలినవి అశ్రువులే, ఆమె కన్నులనుంచి ధారగా వస్తున్నాయి——అతను ఏం చెయ్యాలో తోచక జేబులోంచి రుమాలు తీసి ఇచ్చి ఆ కళ్ళవేపే చూస్తూ కూచున్నాడు.

కన్నుల చెరువుల్లో, కన్నీళ్ళలోతుల్లో, కనరాని రహస్యాల్ని, కన్నార్పక కనిపెడుతున్నాడని గమనించింది సరళ. వెంటనే అక్కణ్నుంచి వెళ్ళిపోయింది.

0 0 0

రామకోటి నవ్వుకున్నాడు.

ఈ బంధం యింతేగాబోలు ! ఇది తెలుసుకుందామని చేసే ప్రయత్నం దీన్ని పెంచి ఊరుకొంటోంది. చిత్రం ! — తెగదు—ఇంతకన్నా పెరగదు. ఒకవేళ పెంచుకుంటే తెంచుకోవడం సాధ్యమేమో. ఈ పెంచుకోడం-తెంచుకోవడం దీంట్లో ఏది మంచో ఎంచుకోడం తెలీడం లేదు !

లోకుల దృష్టిలో "ఏమిటో తమ అనుబంధం" అన్న జిజ్ఞాస వుండేది పూర్వం ! తామేమిటో తమకి తెలిసిపోయినట్టు ! నిజానికి అది ఇప్పటివరకూ తెలియనే లేదు. సామాన్యంలో సమున్నతమైన సంస్కారమా యిది? ముగ్గురికీ స్నేహమే ఆహారం. స్నేహమే వ్యసనం. రంగు రంగుల స్నేహం! - ముగ్గురిలో ప్రతీ ఒక్కరికీ మిగతా ఇద్దరిమీదా ఈ అనుమానాలేమిటో మరి!— ఆనందరావుకి - తనని చంపెయ్యాలని కుట్రచేస్తున్నారని అనుమానం ? ఆ హుషారులో ఆ హాస్య ప్రియత్వంలో - యింత ప్రాణభయం దాగి ఉందా?- సరళకీ వుంది - ఈ మొగాళ్ళిద్దరూ కలిసి తనకి పాతివ్రత్య పరీక్షపెట్టి తను వేసే ప్రతి అడుగూ పరీక్షిస్తూ తను ఎక్కడ తప్పటడుగు వేస్తుందో కనిపెడుతున్నట్టుంటుంది. తనచేత తప్పు చేయించేందుకు తగిన సన్నివేశాలు కల్పిస్తున్నట్టు ఆమెకి ఎప్పటికప్పుడే అనుమానం. — ఇద్దరి వేపూ భయంగా, సందేహంగా చూడకుండా వొక్క సమాధానం చెప్పదు. ఒక్క అడుగు వెయ్యదు !- తనమాట చెప్పనే అక్కర్లేదు - ఎరవేసి లాగుతున్నట్టు వుంటుంది యెకాయెకి! వాళ్ళకేం, హాయిగా పెళ్ళయిన వాళ్ళు, వాళ్ళు తప్పే చెయ్యరు! వాళ్ళకి ఈపాటికి ప్రేమలో థ్రిల్ తగ్గి, తనచేత తప్పు చేయించడానికీ, దాంతో ఆనందం పొందడానికీ - ప్రయత్నిస్తున్నట్టే వుంటుంది. ప్రతీరోజూ పరీక్షే, ప్రతీ నవ్వూ, ప్రతీ మాటా ఎరే. పంజరంలో పక్షినిలా, మ్యూజియమ్‌లో వస్తువునిలా, వాళ్ళు చివరికి తన్ను వినోదం కోసం, ఎక్స్‌పెరిమెంట్ చెయ్యడం కోసం చేరదీసినట్టుంది !

కాని - ఈ అవమానాల అవకాశాల మధ్య, నీతి అవినీతుల పరీక్షల మధ్య - ఏదో. సృష్టికెల్లా తీయని ఆనందం, వర్ణ వర్ణాల మైత్రీ మాధుర్యం కలకాలం కలిసి వున్నందుకు గర్వకారణం — ఉన్నట్టున్నాయి! ఇది తెంచుకోడం మంచిదేకాని సులభం కాదు; ఒకవేళ సులభమే అయితే మంచిది కాదు!

ఈ త్రివర్ణచిత్రం శాశ్వతంగా చెదరక చెరగక నిలవాల్సిందే!

* * *